క్లుప్తంగా


అంకితభావంతో పని చేయాలి

ఒంగోలు రూరల్: వైద్య వృత్తి పవిత్రమైనదని కరవది మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎస్.వాణి అన్నారు. ఆశాడే సందర్భంగా మంగళవారం మాట్లాడుతూ అంకితభావంతో సేవలందించాలని కోరారు. హెచ్ఈవో కృష్ణారెడ్డి మాట్లాడుతూ డీ-వార్మింగ్ డే విజయవంతం చేయాలని కోరారు. సూపర్‌వైజర్ మాధవి, ఎస్ఎస్‌లు జ్యోతి, భానుమతి, విక్టోరియా, ఫార్మసిస్ట్ శ్రీధర్, సిబ్బంది, భార్గవ్, పాల్గొన్నారు.

తులసి కుటుంబానికి అండగా నిలవాలి

ఒంగోలు: తులసి కుటుంబానికి అండగా నిలిచి ఆమె తల్లిదండ్రులకు ఆత్మస్థైర్యం కల్పించాలని దళిత సంఘాల ఐక్యవేదిక జాతీయ అధ్యక్షుడు చప్పిడి వెంగళరావు పోలీసు అధికారులను కోరారు. లింగతోటి తులసి ఆత్మహత్యకు కారణమైన వివరాలను సంపూర్ణంగా తెలుసుకునే నిమిత్తం మంగళవారం మాదిగ చైతన్య వేదిక జిల్లా కన్వీనర్ తేళ్ల దిలీప్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చింతగుంట్ల సువర్ణ, మెడబలిమి రాజేశ్వరి, తులసి మేనత్త పిడుగురాళ్ల కోటేశ్వరి తదితరులతో కలిసి తమ ఆఫీస్ చాంబర్లో తులసి తల్లిదండ్రులను, సోదరుడ్ని విచారించారు. అనంతరం ఆత్మహత్య చేసుకున్న తులసి ఇంటిని సందర్శించి గదిని పరిశీలించారు. వెంగళరావు మాట్లాడుతూ ఇప్పటికీ తులసి తండ్రి రాత్రులు భయంతో కేకలు వేస్తూ వణికిపోతున్నారని, పోలీసు వారు తులసి కుటుంబానికి అండగా నిలిచి ఆత్మస్థైర్యం కల్పించాలన్నారు.


కరాటే బంగారు పతక విజేతలకు సత్కారం



విజేతలను అభినందిస్తున్న నల్లూరి వెంకటేశ్వర్లు

ఒంగోలు: ఈ నెల 4న బాపట్లలో జరిగిన ఇంటర్ స్టేట్ ఇన్విటేషనల్ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో షికోకాయ్ కరాటే ఇంటర్నేషనల్ ఏపీ విద్యార్థులు ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకుని విజేతగా నిలిచారు. ఈ సందర్భంగా సంఘ కార్యదర్శి నల్లూరి మోహనరావు నేతృత్వంలో 120 మంది పాల్గొన్నారు. వీరిలో ఒంగోలుకు చెందిన శ్రీప్రతిభ, గురుదత్త విద్యార్థులు, జిల్లా అసోసియేషన్ విద్యార్థులు 6గురు గోల్డ్ మెడల్స్, 4గురు సిల్వర్, ఇద్దరు బ్రాంజ్ మెడల్స్ కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా మంగళవారం శ్రీప్రతిభ కాలేజీలో జరిగిన కార్యక్రమంలో బంగారు పతక విజేతలను శ్రీప్రతిభ విద్యా సంస్థల అధినేత నల్లూరి వెంకటేశ్వర్లు అభినందించారు. అదే విధంగా మిగిలిన పతక క్రీడాకారులను మరింత మెరుగ్గా రాణించి ఈదఫా జరిగే పోటీల్లో బంగారు పతకం సాధించాలనే పట్టుదలను పెంచుకోవాలన్నారు. సంఘ అధ్యక్షుడు డాక్టర్ గుండవరపు రాఘవరావు, ఉపాధ్యక్షుడు మార్రెళ్ల సుబ్బారావు, నల్లూరి జయప్రకాష్ నారాయణ, డాక్టర్ మొగిలి దేవ, కరాటే కోచ్‌లు వెంకటేశ్వర్లు, విజయలక్ష్మి, రామకృష్ణ, యశ్వంత్ పాల్గొన్నారు.

కులగణన వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న ఎంపీపీ అంజమ్మ కృష్ణారెడ్డి

నాగులుప్పలపాడు: అధికారులంతా సమర్థవంతంగా పాలన చేసి ప్రజలకు అన్ని ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలని ఎంపీపీ నలమలపు అంజమ్మ కృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పంచాయితీ కార్యదర్శుల సమావేశంలో మాట్లాడారు. కుల గణన, జగనన్న ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్‌లు వేగవంతం చేయాలన్నారు. ఎంపీడీఓ మహాలక్ష్మి , ఏపీవో రవి ఉన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష ఓ వరం



గుండమాల సర్పంచ్ జయరావుకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు



మద్దిపాడు: ఎంపీడీఓ సుగుణమ్మ చేతుల మీదుగా రోగులకు మందులు పంపిణీ చేయిస్తున్న సర్పంచ్ గంగిరెడ్డి

మద్దిపాడు: మండలంలోని గార్లపాడు ఘడియపూడి పునరావాస కాలనీలలో ఏర్పాటు చేసిన జగన్న ఆరోగ్య సురక్ష-2 కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. సుమారు 300 మందికి పైగా రోగులు ఈ క్యాంపును వినియోగించుకున్నారు. ఎండీడీఓ సుగుణమ్మ, హెల్త్ క్యాంపును సందర్శించి క్యాంపులో ఏర్పాటు చేసిన కౌంటర్లను పరిశీలించారు. ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా ఏపీని నిలపడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారని హెల్త్ క్యాంపులో స్పెషలిస్ట్ డాక్టర్లు రావడం వలన ప్రజలు ఎక్కువ మంది ఈ కార్యక్రమానికి తరలి వస్తున్నారన్నారు. అనంతరం సర్పంచ్ గంగిరెడ్డి, ఎంపీడీఓ చేతుల మీదుగా రోగులకు మందుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. డిప్యూటీ డీఎంహెచ్ఓ మాధవీలత మాట్లాడుతూ దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నవారు, గర్భిణులు, బాలింతలు ఆరోగ్యంపై అవగాహన కల్పించాలన్నారు. స్పెషలిస్టు డాక్టర్‌లు సుశ్మిత వసంత్, డేవిడ్ విలియమ్స్, మద్దిపాడు పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ ఆనందమోహన్, శ్రావణ్, ఎంపీటీసీ పైనం ప్రభాకర్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది పీహెచ్ఎన్ పద్మావతి, సూపర్‌వైజర్ బాలకోటయ్య, సీతమ్మ, నాగరాజు, ఫార్మసిస్ట్ శాంతిశ్రీ, ల్యాబ్ టెక్నీషియన్‌లు పలువురు ఎంఎల్ హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు వలంటీర్లు పాల్గొన్నారు.




గార్లపాడులో దివ్యాంగుడు లోనికి రాలేకపోవడంతో డాక్టర్ బయటకు వచ్చి పరీక్ష చేస్తున్న దృశ్యం

ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా జీవించాలి

గుండమాల (కొత్తపట్నం): ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా జీవించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రవేశ పెట్టిందని సర్పంచ్ కారాని జయరావు అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత మంగళవారం గుండమాలలో సర్పంచ్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పెట్టడం వలన మన గ్రామానకి వచ్చి డాక్టర్లు వైద్యం చేయటం గొప్ప విశేషమన్నారు. ఈ క్యాంప్‌లో అనేక మందికి బీపీలు, షుగర్లు, దీర్ఘకాలిక వ్యాధులు బయట పడుతున్నాయన్నారు. అప్పుడు ప్రాథమిక దశలోనే వ్యాధి గుర్తించడం వలన తగిన మందులు వాడి వ్యాధి నయం అవుతున్నాయన్నారు. ఈ విధంగా అనేక మంది ఆరోగ్యంగా జీవిస్తున్నారని తెలిపారు. జగనన్న ఆరోగ్య సురక్ష నోడల్ అధికారి డాక్టర్ వాణీశ్రీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన తరువాత వైద్యం మీద విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.25 లక్షలతో వైద్యం చేసుకునే విధంగా ఆరోగ్యశ్రీ స్మార్ట్ కార్డులు పంపిణీ చేసిందన్నారు. కేంద్ర ప్రభుత్వం రూ.5 లక్షలతో ఆయూష్మాన్ భారత్ ఆరోగ్య కార్డులు ఇప్పటికే ఇచ్చిందన్నారు. ఎంతో మంది పేద వారు ఈ కార్డులను ఉపయోగించుకుని ఆప్రేషన్లు చేయించుకోవడం ఇప్పడు చూస్తున్నామన్నారు. క్యాంప్‌లో 305 మందికి వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో కె.పల్లెపాలెం సర్పంచ్ విశ్వనాథపల్లి ఆనంద్‌రావు, డాక్టర్ రమ్య దీపిక, డాక్టర్ వైష్ణవి, కంటి వైద్య నిపుణులు డాక్టర్ అబ్దుల్ రాహు, సీహెచ్‌వో ఓంకార్, గ్రామ పార్టీ అధ్యక్షుడు మల్లిఖార్జున, ఎంఎల్ హెచ్‌పీ (సీహెచ్‌వో) బాబా మాలిక్, ఏఎన్ఎం వెంకటేశ్వరమ్మ, ఆశ వర్కర్ల పాల్గొన్నారు.

అర్బన్ హెల్త్ సెంటర్ సిద్ధం



డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్

ఒంగోలు రూరల్: త్రోవగుంట కేంద్రంగా అర్బన్ హెల్త్ సెంటర్ సిద్ధమైంది. రెండేళ్లక్రితం ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి శంకుస్థాపనం చేయగా కాంట్రాక్టర్ పనులు వేగంగా పూర్తి చేశారు. పాత సబ్‌సెంటర్ వద్ద భవనం పాడుబడిపోవడం వర్షాకాలంలో తీవ్ర ఇక్కట్లకు గురికావడంతో నూతన భవనం అవసరం ఏర్పడింది. భవన దుస్థితిని పరిశీలించిన ఎమ్మెల్యే బాలినేని వైద్యతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ముక్తినూతలపాడు, గుడిమెళ్లపాడు, మండువవారిపాలెం, అంబేద్కర్‌నగర్, దశరాజుపల్లి గ్రామాల ప్రజానీకానికి వైద్యారోగ్య అవసరాలు తీరాలంటే హెల్త్ సెంటర్ త్రోవగుంటలో తప్పనిసరిగా ఉండాలని అధికారులకు తెలియజేశారు. నగరపాలక సంస్థలో త్రోవగుంట విలీనం అయిన నేపథ్యంలో అర్బన్ హెల్త్ కమ్యూనిటీ సెంటర్‌కు ప్రతిపాదనల అనంతరం మంజూరు చేశారు. బాలినేని కృషి మేరకు ఒక్క కోటి నలభై లక్షలు అంచనా వేయడంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మంజూరు చేశారు. దింతో రెండు సంవత్సరాల క్రితం బాలినేని శ్రీనివాసరెడ్డి శంకుస్థాపన చేశారు. చీరాల, ఒంగోలు రోడ్డు మార్గంలో నిర్మించిన ఈ భవనం రోడ్డు మార్గం నుంచి 10 అడుగుల ఎత్తు పెంచి చుట్టూ ప్రహరీతో అత్యాధునిక వసతులతో భవన నిర్మాణం పూర్తయింది. ఆపరేషన్ థియేటర్, ఓపీ రూం, డాక్టర్స్ రూం-2, సిబ్బంది కోసం-3 గదులు, ఇన్ పేషెంట్‌ల కోసం -2 గదులను ఆధునిక హంగులతో కార్పొరేట్ హాస్పిటల్స్ తలదన్నేరీతిలో నిర్మాణాలు పూర్తిచేశారు. విద్యుదీకరణ, పెయిటింగ్ వర్క్స్, నీటి సదుపాయాలు, పూర్తిస్థాయిలో పనులు పూర్తయ్యాయి. పనులు పూర్తికావడంతో భవన నిర్మాణాన్ని సదరు కాంట్రాక్టర్ ప్రభుత్వానికి అప్పగించారు. ఈ భవన నిర్మాణ పర్యవేక్షణ పనులను ఒకటో డివిజన్ నగర కార్పొరేటర్ సామ్రాజ్యం, వైఎస్సార్ సీపీ మండల నాయకులు సాంబయ్య, కట్టా గోపి, కె.ప్రభాకర్ రావు పర్యవేక్షించారు. వేగంగా అర్బన్ హెల్త్ సెంటర్ పూర్తికావడంతో పరిసర గ్రామాల ప్రజానీకం ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు. మరికొద్ది రోజుల్లో లాంఛనంగా ఎమ్మెల్యే బాలినేని ప్రారంభించనున్నారు.

రాజ్యాంగాన్ని రక్షించుకోవాలి



మాట్లాడుతున్న బహుజన పార్టీల సమాఖ్య రాష్ట్ర కన్వీనర్ జైభీమ్ నాగేశ్వరరావు

ఒంగోలు: మతోన్మాదాన్ని ఎదిరించడం ద్వారానే రాజ్యాంగాన్ని రక్షించుకోగలమని బహుజన పార్టీల సమాఖ్య రాష్ట్ర కన్వీనర్ జైభీమ్ నాగేశ్వరరావు అన్నారు. స్థానిక ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన బహుజన పార్టీల సమావేశంలో మాట్లాడుతూ ప్రధాని మోదీ వల్ల నేడు రాజ్యాంగానికి ప్రమాదం ఏర్పడిందన్నారు. దేశ ప్రజల ఓటు హక్కుకు సైతం ప్రమాదం ఏర్పడిందని, ఈ నేపథ్యంలో బాబా సాహెబ్ అంబేడ్కర్ కల్పించిన ఓటు హక్కు ద్వారానే ఉన్మాద శక్తులను ఓడించాలని పిలుపునిచ్చారు. రిపబ్లిక్ పార్టీ అధ్యక్షుడు చెన్నకేశవులు మాట్లాడుతూ ప్రజలకు నిజమైన న్యాయం జరగాలంటే బహుజన పార్టీల సమాఖ్యను ఎన్నికల్లో గెలిపించాలన్నారు. ఇండిపెండెంట్ లేబర్ పార్టీ నాయకులు దాసరి సుందరం మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు వేలకొద్దీ ప్రభుత్వ పాఠశాలలను మూసివేసి ప్రభుత్వ విద్యను నిర్లక్ష్యం చేసి ప్రైవేటు విద్యకు ప్రోత్సాహం కల్పించారని దుయ్యబట్టారు. సమావేశంలో ధర్నాసి పెద్దన్న, రామలింగం, ఎస్‌డీపీఐ నాయకులు సత్తార్ బాషా, కరుణాకర్ తదితరులు పాల్గొని బహుజన పార్టీల సమాఖ్య ఆవశ్యకతను ప్రజలకు తెలియజేసి రాజ్యాధికారం దిశగా సాగేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.

10, 11న అమ్మవారికి పూజలు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న అర్చక స్వాములు నిర్వాహకులు

ఒంగోలు మెట్రో: వాసవి కన్యకా పరమేశ్వరి ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా ఒంగోలు అమలనాథుని వారి వీధిలో కొలువైన వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మ వారి దేవస్థానంలో ఫిబ్రవరి 10 శనివారం, 11వ తేదీ ఆదివారం రెండు రోజులు విజయవాడ వాస్తవ్యులు, వేద పండితులు అంబటిపూడి మారుతి ప్రసాద్ శర్మచే ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తదియారాధన సంఘం ప్రతినిధులు పేర్కొన్నారు. 10వ తేదీ ఉదయం ఏడు గంటలకు అమ్మవారికి అభిషేకం, శ్రీ చక్ర నవావరణార్చన 11 గంటలకు సువాసినీ పూజ బాల కుమారి పూజ, సాయంత్రం ఆరు గంటలకు చండీ పారాయణ, 11వ తేదీ ఆదివారం అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం పురస్కరించుకొని ఉదయం ఏడు గంటలకు పంచామృతల అభిషేకం అమ్మవారికి శ్రీ చండీ హోమం, సాయంత్రం ఏడు గంటలకు శ్రీ వేణుగోపాల స్వామి భజన మండలి వారిచే వాసవి గానామృతం జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. మంగళవారం ఉదయం ఆలయ పురోహితులు, భక్తులు అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవ కరపత్రాలను ఆవిష్కరించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

చీమకుర్తి: ఇండస్ట్రియల్ ఏరియా పరిధిలో బుధవారం కరెంటు సరఫరాను నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ వి.శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉప్పలపాడు 33 కేవీలో పీఎంఐ వర్క్ జరుగుతున్న నేపథ్యంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కరెంటు సరఫరాను నిలిపివేస్తున్నట్లు తెలిపారు. ఆర్.ఎల్.పురం, బూదవాడ, మర్రిచెట్లపాలెం విద్యుత్ సబ్‌స్టేషన్‌ల పరిధిలోని పరిశ్రమలకు సరఫరా ఆగిపోతుందన్నారు. పరిశ్రమల యజమానులు, ఇతర వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

సమాజ హితమే సైన్స్ ధ్యేయం


- ఉల్లాసంగా వీఎస్‌జీ స్కూల్ మెగా సైన్స్ ఫెయిర్



వీఎస్‌జీ స్కూలులో విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్ ప్రాజెక్టులు

ఒంగోలు: స్థానిక సంతపేటలోని వీఎస్‌జీ ఉన్నత పాఠశాలలో సైన్స్ ఫెయిర్ ఘనంగా జరిగింది. చిన్నారులు 70 ప్రాజెక్టులను తమ నైపుణ్యాలతో ప్రదర్శించారు. ఒంగోలు ఉప విద్యాశాఖ అధికారి అనిత రోజ్ రాణి మాట్లాడుతూ సమాజ హితమే సైన్స్ ధ్యేయం అన్నారు. చిన్నతనం నుంచే విద్యార్థుల్లో సైన్స్ పట్ల ఆసక్తిని పెంపొందిస్తూ చిన్నారుల్లో సృజనాత్మకతకు ప్రోత్సాహం కల్పించాలన్నారు. చిన్నారులు తయారు చేసిన ప్రాజెక్టులను అభినందిస్తూనే వారిలో మరింత ఉత్సాహాన్ని, ఉల్లాసాన్ని కలుగజేస్తూనే వారిలో మరింత మెరుగైన ప్రాజెక్టులు రూపొందేలా ఆలోచనలను రేకెత్తించాలని కోరారు. నీటి కొరతను ప్రస్తుతం ప్రపంచం మొత్తం ఎదుర్కొంటుందని, నీటి వృథాను అరికట్టడం అత్యావశ్యకమన్నారు. అందులో భాగంగా చిన్నారులు రూపొందించిన వాటర్ అలారం సమాజానికి ఎంతగానో దోహదపడుతుందన్నారు. అదే విధంగా భూకంపాల రాకను ముందుగా గుర్తించగలిగితే ప్రాణ నష్టాన్ని అరికట్టడం సాధ్యపడుతుందని, అదే విధంగా ఆస్తి నష్టాన్ని కూడా గణనీయంగా తగ్గించగలుగుతామని చెప్పారు. ప్రస్తుతం ప్రపంచ స్థాయిలో మేధావులు దీనిపై తీవ్రమైన పరిశోధనలు చేస్తున్నప్పటికీ చిన్నారుల్లో కూడా దానిపట్ల ఆలోచన కలగడం అభినందనీయమన్నారు. వీఎస్‌జీ పాఠశాల కరస్పాండెంట్ కొల్లా మాధవరావు మాట్లాడుతూ పెరుగుతున్న జనాభాకు తగ్గట్టుగా ఉపాధి అవకాశాల కోసం పరిశ్రమలను స్థాపిస్తున్నామని, ఈ నేపథ్యంలో పర్యావరణం పెను సమస్యగా మారిందన్నారు. ఈ నేపథ్యంలో పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన ఆవశ్యకతను నేడు ప్రపంచం మొత్తం గుర్తించిందని చెప్పారు. ఈ నేపథ్యంలో పాఠశాల నుంచే పర్యావరణంపై అవగాహన ప్రారంభం కావాల్సిన అవసరాన్ని తెలియజేసేందుకు ఇకో ప్రాజెక్టులకు చిన్నారులు ప్రాధాన్యత ఇచ్చారన్నారు. ఈనెల 28న జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని చిన్నారుల్లో సైన్స్ పట్ల అవగాహన పెంచేందుకు తాము మెగా సైన్స్ ఫెయిర్‌ను తమ పాఠశాలలో నిర్వహించనట్లు చెప్పారు. రాధాకృష్ణ స్కూల్ కరస్పాండెంట్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ చిన్నారులను పెద్ద ఎత్తున సైన్స్ ఫెయిర్‌కు సంసిద్ధం చేయడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో ఉందని పేర్కొంటూ అభినందించారు.

హాస్టల్‌కు మౌలిక వసతుల కల్పన



బాలికల హాస్టల్‌కు మంచాలు బహూకరించిన జీవీకే సంస్థ



బాలికల హాస్టల్‌లో అమర్చిన సోలార్ వాటర్ హీటర్

- రూ.11.03 లక్షలతో మౌలిక వసతులు సమకూర్చిన జీవీకే సంస్థ
- నేడు కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్‌చే ప్రారంభం

కొత్తపట్నం: హాస్టళ్లకు ప్రభుత్వం ఎన్నో వసతులు కలిపించింది. పేద విద్యార్థులు చదువుకుని ఎంతో మంది స్థిరపడుతున్నారు. ఇంకా మెరుగైన వసతులు కల్పించాలని ఉద్దేశంతో జీవీకే సంస్థ ముందుకొచ్చింది. కొత్తపట్నంలో సాంఘిక సంక్షేమ శాఖ సమీకృత బాలికల వసతి గృహంలో 100 మందికి పైగా బాలికలు చదువుకుంటున్నారు. అయితే మౌలిక వసతులు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయాన్ని వార్డెన్ అరుణకుమారి జీవీకే సంస్థ మేనేజర్ పిన్ని బంగారయ్య దృష్టికి తీసికెళ్లారు. స్పందించిన ఆయన జీవీకే సంస్థ మేనేజింగ్ డైరెక్టర్, గ్రంధి బాలాజీ, గ్రంధి చల్లారావు, తూర్పుగోదావరి జిల్లా, భీమవరం నియోజకవర్గ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లారు. వెంటనేవారు స్పందించారు. బోరు, విద్యుత్ మోటారు, ఫ్యాన్స్ (22) కోసం రూ.2.04 లక్షలు, సీసీ కెమరాలు నాలుగు కోసం రూ.34,500, సోలార్ వాటర్ హీటర్‌కు గాను రూ.94 వేలు, 100 మంది విద్యార్థులకు రూ.6,93,500 విలువైన మంచాలు, తాగు నీటి ఫిల్టర్ రూ.20 వేలు, రన్నింగ్ వాటర్‌కు పైపు లైన్ కోసం రూ.58 వేలు కేటాయించి ఏర్పాటు చేశారు. వీటిని కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ బుధవారం ప్రారంభించనున్నారు.

శరవేగంగా బస్టాండ్ షెల్టర్ నిర్మాణ పనులు

కొత్తపట్నం: ఆర్‌అండ్‌బీ రోడ్డు నిర్మాణంలో భాగంగా కొత్తపట్నం సెంటర్‌లో బస్టాండ్ షెల్టర్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ప్రోత్సాహంతో ఆర్‌అండ్‌బీ రోడ్డుకు రూ.2.75 కోట్లు నిధులు మంజూరయ్యాయి. మార్కెట్ యార్డు నుంచి కె.పల్లెపాలెం వరకు అంటే 3 కిలో మీటర్ల వరకు రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నాయి. బస్ షెల్టర్‌కు కూడా రోడ్డు మార్జిన్‌లోకి వచ్చింది. దానిని కూడా తొలగించి వెనుక వైపు జరిపి షల్టర్ నిర్మిస్తున్నారు. 80 అడుగుల పొడవు, 12 అడుగుల వెడల్పుతో షెల్టర్ నిర్మాణం జరుగుతోంది. బస్టాండ్‌కు వచ్చి సేద తీర్చికునేవారు, బాలింతలు, గర్భిణులు, చిన్న పిల్లలు, వృద్ధులకు ఇబ్బంది లేకుండా ఎంతో ఉపయోగపడుతుంది. స్థానికుల సహకారంతో బస్‌షల్టర్ పనులు వేగంగా జరుగుతున్నాయి. ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా షల్టర్ ఎంతో ఉపయోగపడనుంది. మండల వ్యవసాయ సొసైటీ అధ్యక్షుడు నాటారు తిరపతిరెడ్డి, డాక్టర్ చెరుకూరి వీరరాఘవరావు, తంబి కాంతారావు, కట్టా శేఖర్‌బాబు, తంబి నరసింహారావు, పురిణి వాసు, కుంతూరి రాము, గౌరవరపు శివాజీ పాల్గొన్నారు.

సుకన్య సమృద్ధి యోజనపై అవగాహన

ఒంగోలు సెంట్రల్: మహిళలు, బాలికలు అవగాహనతో ప్రభుత్వ పథకాలను ఉపయోగించుకోవాలని బీజేపీ కార్యదర్శి తీగల సత్యవతి అన్నారు. స్థానిక గాంధీ నగర్ పోస్ట్ ఆఫీస్ కార్యాలయంలో మంగళవారం బాలికలకు సుకన్య సమృద్ధి యోజన పథకంపై అవగాహన కల్పించి ఖాతాలను తెరిపించారు. పోస్ట్ మాస్టర్ క్రిష్టారావు, మహిళా నాయకులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ తనిఖీ



పోలీస్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న డీఎస్పీ కిషోర్ బాబు

నాగులుప్పలపాడు: డీఎస్పీ ఎం. కిషోర్ బాబు మంగళవారం నాగులుప్పలపాడు పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బందితో కేసుల వివరాలు, రికార్డుల భద్రత వంటి అంశాలపై చర్చించారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానం పాటించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్లు చేయాలి

కొత్తపట్నం: జగనన్న లేఅవుట్లల్లో ఇచ్చిన ఇళ్ల పట్టాల లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్లు త్వరిగతిన చేయాలని జేసీ ఆర్. గోపాలకృష్ణ రెవెన్యూ, సచివాలయం సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం కొత్తపట్నం సచివాలయం తనిఖీ చేశారు. మండలంలో ఎన్ని జగనన్న లేఅవుట్లు వేశారు. ఎంత మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చారు, రిజిస్ట్రేషన్లు ప్రారంభించారా అని వివరాలు అడిగి తెలుసుకున్నారు. మండలంలో 948 మందికి ఇళ్ల పట్టాలు మంజూరు చేశామని ఇందులో 630 మందిని అర్హులుగా తేల్చామని, మిగతా వారికి ల్యాండ్ కొనుగోలు చేసి ఇవ్వడానికి ప్రతిపాదనలు పంపించామన్నారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ నవరత్నాలు- పేదలందరికీ ఇళ్లు అనే కార్యక్రమంలో భాగంగా ఇళ్ల పట్టాలు మంజూరు చేసిన ప్రతి ఒక్కరికీ రిజిస్ట్రేషన్ చేయాలన్నారు. నూరు శాతం రిజిస్ట్రేషన్లు జరగాలన్నారు. వీఆర్వో, పంచాయతీ కార్యదర్శి తప్పనిసరిగా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా అసైన్‌మెంట్ ల్యాండ్ ఇచ్చి 20 సంవత్సరాలు నిండి వారి సమాచారం కూడా తీసుకోవాలని సూచించారు. అధికారులంతా అందుబాటులో ఉండాలని కోరారు. తహసీల్దార్ ఎస్. సురేష్, డీటీ అర్జున్‌రెడ్డి, ఈవోఆర్డీ ఏ.బాలచెన్నయ్య, ఆర్ఐ వెంకటరత్నం, ఏఎస్‌వో కోటేశ్వరరావు, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పొగాకు క్యూరింగ్‌లో జాగ్రత్తలు పాటించాలి

ఒంగోలు సెంట్రల్: పొగాకు క్యూరింగ్‌లో ఉత్తమ యాజమాన్య పద్ధతులు పాటించాలని ఒంగోలు-2 వేలం నిర్వాహణాధికారి కోవి రామక్రిష్ణ అన్నారు. ఒంగోలు-2 పరధిలోని పోతవరం, అనక్రోలు వారిపాలెం, ఎన్‌జీ పాడు, టీ అగ్రహారం, ఉప్పలపాడు, మద్దిరాలపాడులో పొగతోటలు, బ్యారన్‌లు, గ్రేడింగ్‌లను రైతు మిత్ర బృందంలోని వేలం నిర్వాహణాధికారులు కోవి రామక్రిష్ణ, తులసి, రామాంజనేయులు, ఐటీసీ మేనేజర్ యశ్వంత్ కుమార్, ఏటఐ సభ్యులు వెంకటేశ్వర్లు పరిశీలించారు. రైతులు పొగాకు రీల్స్ అల్లే సమయంలో టార్పాలిన్ ఆకుపై కప్పుగా, ఆకుల కిందవేయాలని చెప్పారు. గ్రేడింగ్ చేసే సమయంలో పొగాకు అన్య పదార్థాలు, గడ్డి పీచు, బైడింగ్ వైరులు, ప్లాస్టిక్ రాకుండా చెయ్యాలని కోరారు. రైతులు పండిన ఆకులను రేల్చి క్యూరింగ్ చేసుకోవాలని చెప్పారు.